# మహిళను బస్సు ఎక్కించుకోని డ్రైవర్

- ఓవర్‌లోడ్ అయిందని నిరాకరణ
- బస్సు నీదా అంటూ గొడవకు దిగిన మహిళ
- బస్సు నడపలేనంటూ డ్రైవర్ అసహనం
- హైదరాబాద్ లక్డీకాపూల్‌లో ఘటన
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకొచ్చి మహాలక్ష్మీ స్కీం కింద తెచ్చిన ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలు లబ్ధి పొందటమేమో కానీ.. మొదటి నుంచి విపరీతమైన వివాదాలు చోటుచేసుకొంటూ నిత్యం వార్తల్లో నిలుస్తున్నాయి. మొదట్లో బస్సు ఆపట్లేదని డ్రైవర్లపై.. టికెట్లు అడుగుతున్నారంటూ కండక్టర్లపై దాడులకు దిగగా.. మధ్యలో ప్రయాణికులు సీట్ల కోసం సిగలు పట్టుకుని పొట్టుపొట్టుకొట్టు కొన్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు మళ్లీ ఆ పరిస్థితి మొదటికి వచ్చింది. హైదరాబాద్ లక్డీకాపూల్‌లో ఆర్టీసీ బస్సు ఓవర్ లోడ్ అయిందని ఓ మహిళను బస్సు ఎక్కించుకునేందుకు డ్రైవర్ నిరాకరించారు. దీంతో.. తనను ఎందుకు ఎక్కించుకోరు అంటూ సదరు మహిళా.. బస్సుకు అడ్డం తిరిగి ముందుకు వెళ్లకుండా చేసి.. ఆ ఆర్టీసీ డ్రైవర్ పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకొన్నది. బస్సు పూర్తిగా నిండిపోయిందని.. నిలబడటానికి కూడా స్థలం లేదని.. ఎక్కితే తనకే కాక బస్సు నడిపేందుకు కూడా ఇబ్బంది అవుతుందంటూ ఎంత చెప్పినా వినిపించుకోకుండా ఆ మహిళ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. బస్సు నీదా అంటూ డ్రైవర్ మీదికి సదరు మహిళ ఎదురు తిరిగింది. ఒక్క ఆ మహిళే అనుకొంటే.. బస్సులోని మహిళలు కూడా ఆమెకు వంత పాడుతూ... ఉచితబస్ ఎవరు పెట్టమన్నారంటూ మండిపడ్డారు. దీంతో.. తీవ్ర అసహనానికి లోనైన ఆ బస్సు డ్రైవర్.. ఇక నేను బస్సును నడపలేను బాబోయ్.. నువ్వే బండి తీసుకుని పో.. అంటూ బస్సును రోడ్డుపైనే వదిలేసి.. దిగి వెళ్లిపోయాడు. గురువారం జరిగిన ఈ తతంగాన్ని అదే బస్సులోని ఓ ప్రయాణికుడు వీడియో తీసి.. సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయగా.. అది కాస్త వైరల్‌అవుతున్నది. కాగా.. ఈ వీడియో చూసిన నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు.

## ముగ్గురిని మింగిన 'మున్నేరు'

### ఈత కొట్టేందుకు వెళ్లి చిన్నారులు మృతి

ఖమ్మం రూరల్, మే 9 : వేసవి సెలవులు కావడంతో ముగ్గురు చిన్నారులు సరదాగా ఈత కొట్టేందుకు మున్నేరు వాగు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి ప్రాణాలు వదిలారు. ఈ ఘటన ఖమ్మం నగర శివారులోని మున్నేరు వాగులో గురువారం చోటుచేసుకున్నది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని మమత వైద్యశాల వెనుక రామచంద్రయ్య నగర్‌కు చెందిన ఆముదాల చిరంజీవి, లక్ష్మి దంపతుల ఇద్దరు కొడుకులు లోకేశ్ (12), హరీశ్ (10)తోపాటు అదే కాలనీకి చెందిన బానోత్ కళావతి కుమారుడు గణేశ్(9) ఈత కొట్టేందుకు దంసలాపురం-గుదిమళ్ల మధ్యలోని మున్నేరు వాగు పరిసరాలకు వెళ్లారు. అక్కడ వాగులో హైవే నిర్మాణం కోసం తీసిన గుంతలోకి దిగారు. లోతు ఎక్కువగా ఉండటంతో నీటిలో మునిగిపోయారు. గమనించిన స్థానికులు పిల్లలను రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఎస్సై రామారావు, రెస్క్యూ సిబ్బందితో కలిసి ట్రైనీ ఐపీఎస్ మౌనిక ఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లతో నీటి లోతు తెలుసుకొని పిల్లల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దాదాపు మూడు గంటల తరువాత మృతదేహాలను బయటకు తీశారు. ఘటనా స్థలంలో తమ పిల్లల మృతదేహాలను చూసిన తల్లిదండ్రులు బోరున విలపించారు.

# ఆటో డ్రైవర్ ఆత్మహత్య

- ఉచిత బస్సు ప్రయాణంతో ఉపాధి కోల్పోయి బలవన్మరణం
- కామారెడ్డి జిల్లాలో విషాదం


నవీన్ (ఫైల్)

మాచారెడ్డి, మే 9 : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఉపాధి కోల్పోయి ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం గజ్యానాయక్ తండా గ్రామంలో గురువారం చోటుచేసుకున్నది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తండా గ్రామ పరిధిలోని చంద్రునాయక్ తండాకు చెందిన లావుడ్యా శ్రీనుకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు శ్రీకాంత్, నవీన్ (21) ఉన్నారు. ఆటోడ్రైవర్‌గా పనిచేసే శ్రీను అనారోగ్యంతో ఏడాది క్రితం మృతి చెందాడు. పేద కుటుంబం, రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. పెద్ద కుమారుడు శ్రీకాంత్ ఇంటి వద్దే ఖాళీగా ఉంటున్నాడు. తల్లి మక్క బుట్టలు అమ్ముతుండగా, చిన్న కుమారుడు నవీన్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో సరిగా నడువక ఆదాయం పడిపోయింది. దానికి తోడు ఆటో తరచూ సతాయిస్తుండటంతో అప్పు తెచ్చి మరమ్మతు చేయించాడు. అయినా ఫలితం లేకపోవడంతో దాన్ని అమ్మేసి మరోటి కొన్నాడు. అదీ కూడా సరిగా నడువకపోవడంతో ఇబ్బందులకు గురయ్యాడు. అప్పటికే తెచ్చిన అప్పుకు వడ్డీ భారం పెరిగిపోవడం మనస్తాపానికి గురైన నవీన్ గురువారం ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## మోదీ, రాహుల్ బహిరంగ చర్చకు రావాలి

### ముగ్గురు ప్రముఖుల లేఖ

న్యూఢిల్లీ, మే 9: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఒక తటస్థ వేదికపై బహిరంగ చర్చకు రావాలని ఒక ప్రముఖ పాత్రికేయుడు, ఇద్దరు మాజీ న్యాయమూర్తులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ద హిందూ మాజీ సంపాదకుడు ఎన్ రామ్, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి మదన్ లోకూర్, ఢిల్లీ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఏపీ షాలు నేతలిద్దరికీ లేఖలు రాశారు. వాణిజ్యేతర, పార్టీయేతర వేదికపై ఈ చర్చను జరపాలని, ఇలాంటి బహిరంగ చర్చ కారణంగా ప్రజలకు అవగాహన ఏర్పడటమే కాకుండా ఒక ఆరోగ్యకరమైన, శక్తివంతమైన ప్రజాస్వామ్యాన్ని ప్రదర్శించడంలో గొప్ప ఉదాహరణగా నిలుస్తుందని అన్నారు. ఒక వేళ వారికి పాల్గొనేందుకు వీలులేకపోతే తమ ప్రతినిధులనైనా ఈ బహిరంగ చర్చకు పంపాలని వారు కోరారు.

## 301.03 కోట్లు సీజ్

### సీఈవో వికాస్‌రాజ్

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రూ.301.03 కోట్ల నగదు, విలువైన వస్తువులను సీజ్ చేశామని రాష్ట్ర సీఈవో వికాస్‌రాజ్ తెలిపారు. మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించడం వల్ల 8,481 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ ప్రక్రియ దాదాపు పూర్తయిందని చెప్పారు. మొత్తం 2,64,043 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోగా, వీరిలో 2,29,072 మంది ఓటు హక్కు వినియోగించుకొన్నారని తెలిపారు. వీరిలో 34,973 మంది ఉద్యోగులు ఈడీసీ ఎంపిక చేసుకొన్నారని చెప్పారు. బుధవారం నాటికి 1,75,994 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారని, ఈ ఈ ప్రక్రియ ఈ నెల 10 వరకు కొనసాగనున్నదని వివరించారు.








